# సాక్షి


## అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 23 । జనవరి । 2023




### పెరిగిన చలి తీవ్రత

సాక్షి,పాడేరు: చలిగాలుల తీవ్రత నెలకొంది. మినుములూరులో 10, అరకులోయలో 14.3, చింతపల్లిలో 15.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



### ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి

పర్యాటక ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పోలీసుశాఖ దృష్టి సారించింది. సమస్య తలెత్తకుండా సిబ్బందిని నియమించింది. 8లో



### బాధితులకు అండగా 'మన్య ప్రగతి' 8లో

మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ బాధితులకు సాయం అందిస్తూ బాసట గా నిలుస్తోంది.

## న్యూస్‌రీల్

### ముగిసిన ప్రత్యేక రైలు సేవలు

సాక్షి,పాడేరు: అరకులోయ ప్రాంతాన్ని సందర్శించే పర్యాటకుల సౌకర్యార్థం రైల్వేశాఖ నడిపిన ప్రత్యేక రైలు సేవలు ఆదివారంతో ముగిశాయి. గత ఏడాది డిసెంబర్ ఒకటి నుంచి ప్రత్యేక రైలును విశాఖ నుంచి నడిపారు. పర్యాటకులు ఈ రైలు సేవలను సద్వినియోగం చేసుకున్నారు. విశాఖ నుంచి కిరండోల్ నడిచే రెగ్యులర్ రైలుతో పాటు, ప్రత్యేక రైలులో పర్యాటకులు భారీగా తరలివచ్చారు. పర్యాటక సీజన్ ముగుస్తున్న నేపథ్యంలో ప్రత్యేక రైలు సేవలు సోమవారం నుంచి నిలిచిపోనున్నాయి. ఆదివారం ఈ రెండు రైళ్లలో పర్యాటకులు అరకులోయకు రాకపోకలు సాగించారు.

### నాక్ గుర్తింపునకు భాగస్వాములు కావాలి

సాక్షి,పాడేరు: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో చదువుతున్న ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు నాక్ గుర్తింపునకు భాగస్వామ్యం అవ్వాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని లెర్నింగ్ సపోర్టు సెంటర్–128 సమన్వయకర్త మురళీధరరావు కోరారు. నాక్ నుంచి పలు ప్రశ్నలతో కూడిన మెయిల్స్ వస్తాయని, విద్యార్థులంతా వాటిని ఓపెన్ చేసి, తగిన సమాధానాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. నాక్ నుంచి మూడు దశలుగా వచ్చే మెయిల్స్ కాలపరిమితి ముగియక ముందే విద్యార్థులు రిపోర్టు చేయాలన్నారు. విద్యార్థులు ప్రతి రెండు రోజులకు ఓ సారి తమ మెయిల్‌ను పరిశీలించుకోవాలన్నారు. విద్యార్థులంతా సంతృప్తికరమైన సమాధానాలు పంపడం ద్వారా విశ్వ విద్యాలయానికి నాక్ గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఎలాంటి సందేహాలున్నా పాడేరు అధ్యయన కేంద్రాన్ని, 9490458695, 7382929728 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

### ఓపెన్ యూనివర్సిటీ పరీక్ష ఫీజుకు 25 వరకు గడువు

సాక్షి,పాడేరు: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్షలకు సంబంధించి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం ద్వారా అడ్మిషన్లు పొందిన అభ్యర్థులు పరీక్ష ఫీజులు ఈనెల 25లోగా చెల్లించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టాబ్బాయి తెలిపారు. బీఏ, బీకాం,బీఎస్సీ విద్యార్థులు 1,3,5 సెమిస్టర్లకు సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైబ్‌సైట్‌లో దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు తమ కళాశాలలోని స్టడీ సెంటర్‌తోపాటు 9490458695, 7382929728 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

### పాడేరులో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్

పాడేరు రూరల్: జిల్లా కేంద్రమైన పాడేరులో ఈనెల 26న రిపబ్లిక్ డే వేడుకలు జరగనున్న నేపథ్యంలో ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. ప్రత్యేక బాంబ్ స్క్వాడ్‌లతో రెండు రోజులుగా విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. పాడేరు సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు లక్ష్మణ్, రంజిత్, ఇతర సిబ్బందితో కలిసి ఆదివారం పాడేరు నుంచి గుత్తులపుట్టు, డి. గొందూరు వెళ్లే మార్గాల్లో కల్వర్టులు, వంతెనలను క్షుణ్ణంగా పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అతిథి గృహాలను తనిఖీ చేశారు. రిపబ్లిక్‌డే వేడుకల వరకు నిరంతర తనిఖీలు కొనసాగుతాయని సీఐ పేర్కొన్నారు.

**వారపు సంతలో..**

సీలేరు: స్థానిక పోలీసుస్టేషన్ పరిధి ధారకొండలో ఆదివారం జరిగిన వారపు సంతలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ రామకృష్ణ, సీఆర్పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ సురేష్ నేతృత్వంలో తనిఖీ చేశారు. వారపు సంతలో వినియోగదారుల సమస్యలు తెలుసుకున్నారు. నకిలీ వస్తువులు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

### గంజాయి నిందితుడి అరెస్టు

సీలేరు: గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేశామని, ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. గత డిసెంబర్ 19న సీలేరు నుంచి అక్రమంగా తరలిస్తున్న నాలుగు కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో అప్పటిలో నలుగురిని అరెస్టు చేశారు. వీళ్లకు గంజాయి సరఫరా చేసిన చల్లనిశిల్ప గ్రామానికి చెందిన కుర్ర ప్రసాద్ అప్పటిలో తప్పించుకున్నాడని ఎస్‌ఐ తెలిపారు. అప్పటినుంచి గాలించగా ఆదివారం పట్టుబడినట్టు ఆయన వివరించారు. ఈ మేరకు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని ఆయన పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోలులో రికార్డ్..!

**జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ ఏడాది ఆశాజనకంగా దిగుబడి రావడంతో ప్రభుత్వం ఏర్పాటుచేసిన కేంద్రాల్లో విక్రయిస్తున్నారు. దీంతో అధికారులు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి కొద్దిరోజుల్లో చేరుకోనున్నారు. ప్రభుత్వం కూడా వారి ఖాతాల్లో ఎప్పటికప్పుడు నగదు జమ చేస్తోంది.**

- లక్ష్యం 23 వేల టన్నులు
- సేకరించింది 19,268 టన్నులు
- మిగతా పదిరోజుల్లో టార్గెట్‌కు చేరువ
- జిల్లా పౌరసరఫరాల విభాగ అధికారుల వెల్లడి



ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న పౌరసరఫరాల విభాగం అధికారులు

సాక్షి, పాడేరు: జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు గిరి రైతులకు మేలు చేశాయి. దళారుల బారిన పడి మోసపోకుండా దోహదపడ్డాయి. ప్రభుత్వం క్వింటా ధాన్యం కిలోకు రూ. 2040 మద్దతు ధరను అమలుచేసింది. జిల్లాలో 23 వేల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా అధికారులు పెట్టుకున్నారు. దీనిపై అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించారు. రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తూ లక్ష్యానికి చేరువలో ఉన్నారు.

**రికార్డు స్థాయిలో..**

పాడేరు డివిజన్ పరిధిలో అనంతగిరి, అరకులోయ, చింతపల్లి, డుంబ్రిగుడ, జీకే వీధి, జి.మాడుగుల, హుకుంపేట, ముంచంగిపుట్టు, పాడేరు, పెదబయలు మండలాల రైతులు మాత్రం ధాన్యాన్ని సొంత అవసరాలకు ఉపయోగించుకుంటారు. కొయ్యూరు మండలంతో పాటు, రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలో మాత్రం రైతులు ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకున్నారు. 22 మండలాల్లో 23 వేల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా, 13 మండలాల్లో ఇప్పటికి 19,268 టన్నుల ధాన్యాన్ని రికార్డు స్థాయిలో కొనుగోలు చేశారు.

**మిగతా పది రోజుల్లో..**

రానున్న పదిరోజుల్లో మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు పౌరసరఫరాల అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. సుమారు 3,621 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయగా రూ.39.31 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే 2,634 మంది రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.23.78 కోట్లు జమచేశారు. మిగిలిన రైతులకు కూడా ప్రతి రోజు నగదు జమ ప్రక్రియ కొనసాగుతోంది. అలాగే కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీల ద్వారా తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాలోని ప్రభుత్వం నిర్దేశించిన మిల్లులకు తరలిస్తున్నారు.

### కొనుగోలు కేంద్రాలతో మేలు



రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌బీకే కేంద్రాల ద్వారా ధాన్యాన్ని గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయడం వల్ల ఎంతో మేలు జరిగింది. వీటి ద్వారా ప్రభుత్వం దళారుల దోపిడీని అడ్డుకట్ట వేయగలిగింది. నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లోనే అనుకున్న సమయానికి నగదు జమ అవుతోంది.

– చిన్ని గోరెసు, రైతు, రాజవొమ్మంగి

### లక్ష్యానికి చేరుకుంటాం

ప్రభుత్వ లక్ష్యం మేరకు జిల్లాలో ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని చేరుకుంటాం. లక్ష్యానికి తగ్గట్టుగానే తమ అధికారులు, సిబ్బంది ధాన్యం కొనుగోలుకు శ్రమించారు. నగదును కూడా వారి ఖాతాల్లో ఎప్పటికప్పుడు జమ చేస్తున్నాం

– గణేష్, జిల్లా పౌరసరఫరాల అధికారి, పాడేరు

## ప్రశాంతంగా ఓపెన్ స్కూల్ ఎడ్యుకేషన్ పరీక్ష



పాడేరు జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

సాక్షి, పాడేరు: జిల్లాలో ఆశా కార్యకర్తలకు ఆదివారం నిర్వహించిన ఓపెన్ స్కూల్ ఎడ్యుకేషన్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పాడేరులోని ఎనిమిది, రంపచోడవరంలో ఒక కేంద్రంలో 1570 మంది పరీక్షలు రాశారు. వీరిలో 166 మంది మూడవ తరగతి,1275మంది ఐదవ తరగతి,129 మంది 8వతరగతికి చెందిన వారున్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, డీఈవో రమేష్, ఓపెన్ స్కూల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర సమన్వయకర్త శ్రీనివాస్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ఆశా కార్యకర్తల విభాగం సమన్వయకర్త మనోజ్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి సింహాద్రి, టీబీ పర్యవేక్షకులు కిరణ్ తదితరులు పర్యవేక్షించారు.

**కనీస విద్యార్హత తప్పనిసరి**

ఆశా కార్యకర్తలకు కనీస విద్యార్హత 8వతరగతి ఉండాలన్న ఆదేశాల మేరకు ఓపెన్ స్కూల్ విధానంలో ఆశా కార్యకర్తలకు ప్రాథమిక విద్యను అందిస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రాథమిక విద్యకు నోచుకోని 1570 మంది ఆశా కార్యకర్తలను జిల్లాలో గుర్తించామని,వారికి ఓపెన్ స్కూల్ ద్వారా విద్యను అందిస్తున్నామన్నారు. వారికి ఉన్న విద్యార్హతను బట్టి 3,5,8 తరగతులుగా విభజించి.వారి సొంత గ్రామాలలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల ద్వారా 50 రోజుల పాటు విద్యా బోధన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఆశా కార్యకర్తలకు పుస్తకాలను కూడా పంపిణీ చేసి కాంటాక్ట్ లెర్నర్ ప్రోగ్రామ్ ద్వారా ఉపాధ్యాయులు విద్య అందించారని ఆయన తెలిపారు.

## రిపబ్లిక్ డేకి నలుగురు ఖైదీల విడుదల?

ఆరిలోవ: గణతంత్ర దినోత్సవానికి నలుగురు జీవిత ఖైదీలు విడుదలకానున్నట్లు తెలిసింది. సాధారణంగా గాంధీ జయంతి, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా ఖైదీలు క్షమాభిక్షపై విడుదలవుతుంటారు. గత ఏడాది నుంచి గణతంత్ర దినోత్సవానికి అమృత్ కా ఆజాద్‌లో భాగంగా తక్కువ శిక్ష పడినవారిలో సత్ప్రవర్తన కలిగినవారిని విడుదల చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల ఏడుగురు ఖైదీల జాబితాను ఇక్కడ జైల్ అధికారులు ఉన్నతాధికారులకు పంపించారు. ఆ జాబితాలో ఒకరిని అనర్హుడిగా ఉన్నతాధికారులు గుర్తించారు. మిగిలిన ఆరుగురిలో ఇద్దరికి ఇటీవల బెయిల్ లభించడటంతో విడుదలయ్యారు. మిగతా నలుగురిని అమృత్ కా ఆజాద్‌లో భాగంగా వారిని ఈనెల 26న విడుదల చేసే అవకాశం ఉంది.

### ఆలస్యంగా కోరాపుట్ స్పెషల్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): రాయగడ–విజయనగరం లైన్‌లో జరుగుతున్న పలు భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల వల్ల విశాఖపట్నం–కోరాపుట్ (08546) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సోమవారం మూడు గంటలు ఆలస్యంగా బయల్దేరుతుందని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖలో ఉదయం 6.30 గంటలకు బయల్దేరాల్సిన ఈ రైలు 9.30 కు బయల్దేరుతుందని పేర్కొన్నారు.

## భూవివాదాలను సామరస్యంగా పరిష్కరించండి

**అధికారులకు ఎస్టీ కమిషన్ ఛైర్మన్ రవిబాబు ఆదేశం**



ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబుకు వినతిపత్రం అందజేస్తున్న కురిడి గిరిజనులు

సాక్షి,పాడేరు: డుంబ్రిగుడ మండలం కురిడి పంచాయతీలోని ఐదు గ్రామాలు, కండ్రుం పంచాయతీ జంకోరుగుడ గ్రామాల మధ్య నెలకొన్న భూవివాదాలను సామరస్యంగా పరిష్కరించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు అధికారులను ఆదేశించారు. కురిడి పంచాయతీలోని గదబగులుగు, బలియగుడ, గొందిగుడ,పుట్టబంద, పొడచంప గ్రామాలకు చెందిన గిరిజనులతో పాటు కురిడి సర్పంచ్ బోయిన లచ్చు, వైఎస్సార్‌సీపీ నేతలు గుడివాడ ప్రకాష్,వార్డు సభ్యులు ప్రసాద్, రఘురామ్ ఆదివారం విశాఖలో ఎస్టీ కమిషన్ ఛైర్మన్ రవిబాబును కలిసి భూవివాదంపై వినతి పత్రం అందజేశారు. కురిడి పంచాయతీలోని ఐదు గ్రామాల గిరిజనులమంతా పూర్వం నుంచి గదబగలుగు కొండపై పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని వారు వివరించారు. అయితే తమ పంచాయతీకి సమీపంలోని కండ్రుం పంచాయతీ జంకొరుగుడ గ్రామస్తులు కట్టెల పేరుతో వచ్చి చెట్లను నరికివేస్తున్నారని వారు వాపోయారు. కాఫీతోటలతో పాటు,అంతరపంట మిరియాల పొదులను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. కొండకు రావొద్దని చెబుతుంటే దాడులకు పాల్పడడంతో పాటు తమ ఐదు గ్రామాల ప్రజలపై పోలీసు కేసులు పెట్టి వేధిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని వారు కోరారు. దీనిపై స్పందించిన కమిషన్ ఛైర్మన్ రవిబాబు ఫోన్‌లో పాడేరు సబ్‌కలెక్టర్, పాడేరు డీఎఫ్‌వో,అరకులోయ సీఐలతో మాట్లాడారు. ఎవరి సరిహద్దుల్లో భూములను వారే సాగు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు లేకుండా చూడాలని వారికి రవిబాబు సూచించారు.

## తప్పుడు ఆరోపణలు తగవు



ఐటీడీఏ ఎదుట రిలే దీక్షలు చేస్తున్న ప్రజాసంఘాల వేదిక నేతలు రాధాకృష్ణ, ప్రభుదాస్ తదితరులు

సాక్షి,పాడేరు: గిరిజనుల సమస్యలు పరిష్కారం కావాలని గిరిజన విద్యాలయాల్లో ఆరుగురు గిరిజన విద్యార్థుల మరణాలపై విచారణ జరపాలని ఐటీడీఏ ఎదుట శాంతియుతంగా దీక్షలు చేస్తున్న తమపై ఉద్యోగ జేఏసీ నేతలు తప్పుడు ఆరోపణలు చేయడం అన్యాయమని, ప్రజాసంఘాల వేదిక నేతలు రాధాకృష్ణ,ప్రభుదాస్ పేర్కొన్నారు. ఐటీడీఏ ఎదుట రిలేదీక్షలను ఆదివారం కొనసాగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల న్యాయసమ్మతమైన ఉద్యమానికి దిశా నిర్దేశం చేయాల్సిన గిరిజన సంక్షేమ ఉద్యోగ,ఉపాధ్యాయసంఘ నేతలు ఐటీడీఏ పీవోకు కొమ్ముకాసి తమపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం సమంజసం కాదన్నారు. గిరిజన విద్యార్థులు మృతిచెందుతుంటే వారి మరణాలకు రూ.లక్షలు వెలకడుతున్నారని వారు ఆరోపించారు. గిరిజన ఉద్యోగుల సంఘ ఎన్నికల సమయంలో గిరిజన ఉద్యోగుల నుంచి రూ.14లక్షలు వసూలు చేసి,ఆ సభ్యత్వం సొమ్ము సంఘానికి చెల్లించలేని నాయకులు కూడా తమపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గిరిజన ఉద్యోగుల సంఘ ఎన్నికల్లో పోటీకి కూడా అర్హత లేకుండా బహిష్కరణకు గురైన నేతలు వారి గత చరిత్రను తెలుసుకోవాలని సూచించారు. అధికారులకు కొమ్ముకాస్తూ ప్రజాసంఘాల వేదిక నేతలపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న ఉద్యోగ జేఏసీపై కలెక్టర్ విచారణ జరిపి తమ న్యాయ సమ్మతమైన ఉద్యమానికి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నారావు, నరేష్, లోకేష్ పాల్గొన్నారు.



చెరువులవేనంలో సందడి చేస్తున్న పర్యాటకులు

# పర్యాటకులు పోటెత్తారు

ప్రకృతి అందాలకు నిలయమైన మన్యంలో రెండు రోజుల నుంచి పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. కొద్దిరోజుల్లో పర్యాటక సీజన్ ముగియనుండటంతో తాకిడి పెరిగింది. జిల్లాలో వంజంగి హిల్స్, లంబసింగి, చెరువుల వేనం, బొర్రా గుహలు, కొత్తపల్లి జలపాతం, అరకు గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్, మారేడుమిల్లిలోని పర్యాటక ప్రాంతాలను అధిక సంఖ్యలో సందర్శించారు.



కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకుల సందడి

సాక్షి,పాడేరు: మండలంలోని వంజంగి హిల్స్‌కు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. వేకువజామున సూర్యోదయం, కొండలను తాకిన మేఘాలు, పొగ మంచును వీక్షించి పరవశించిపోయారు. లంబసింగి, తాజంగి, చెరువులవేనం ప్రాంతాలకు పర్యాటకుల తాకిడి పెరిగింది. హుకుంపేట మండలం సీతమ్మకొండ, అరకులోయ మండలం మాడగడ హిల్స్‌కు సందర్శకులు తరలివచ్చారు.

**బొర్రాకు రూ.3.43 లక్షల ఆదాయం**

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకులు ఆదివారం పోటెత్తారు. సుమారు 4,359 మంది పర్యాటకులు గుహలను తిలకించగా, 3.43 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీశంకర్ తెలిపారు. కటికి, తాటిగుడ, చిట్టంపాడు, సరియా జలపాతాలు, కాఫీ ప్లాంటేషన్, డముకు వ్యూపాయింట్ తదితర సందర్శిత ప్రాంతాలు సందడిగా కనిపించాయి.

**పాపికొండలు సందర్శనకు 565 మంది..**

దేవీపట్నం: పాపికొండలు సందర్శనకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకున్న 565 మంది రాజమహేంద్రవరం నుంచి పోశమ్మగండికి వచ్చారు. అక్కడి నుంచి పర్యాటకశాఖకు చెందిన సర్‌ఆర్థర్ కాటన్ బోటుతో పాటు మరో ఎనిమిది ప్రైవేట్ బోట్లలో తరలివెళ్లారు.

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతానికి పర్యాటకులు పోటెత్తారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రైవేట్ సంస్థలకు ఆదివారం సెలవు కావడంతో భారీ సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో వ్యూపాయింట్ సందడిగా మారింది. కబాబులు, బొంగు చికెన్ అమ్మకాలు జోరుగా సాగాయి.

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతానికి ఆదివారం మైదాన ప్రాంతాల నుంచి భారీగా సందర్శకులు తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. బేంబూ చికెన్ అమ్మకాలు జోరుగా సాగాయి.

చింతపల్లి రూరల్: లంబసింగికి పర్యాటకుల తాకిడి పెరిగింది. శనివారం రాత్రి లంబసింగి చేరుకున్నారు. ప్రకృతి అందాలను తిలకించారు.



రాజవొమ్మంగిలో మంచుతెరలు



మారేడుమిల్లి ప్రాంతంలో పర్యాటకుల ఫైర్ క్యాంప్

## మంచు గుప్పెట్లో మన్యం

మారేడుమిల్లి: ఏజెన్సీ ప్రాంతమైన మారేడుమిల్లిని మంచుతెరలు కమ్మేస్తున్నాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వారం రోజులుగా పగటి పూటతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు అమాంతం పడిపోవడంతో ప్రజలు చలి తీవ్రతకు అల్లాడిపోతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు, కూలి పనులకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పది గంటల వరకు చలి ప్రభావం ఉంటోంది. సాయంత్రం 5 గంటలకే జనం ఇళ్లకే పరిమితం అవుతున్నారు. ఇక్కడకు వచ్చే పర్యాటకులు ఫైర్ క్యాంపులు వేసుకొని చలి వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రమైన రాజవొమ్మంగి పరిసర ప్రాంతాలను మంచు తెరలు కమ్మేశాయి. ఉదయం 9 గంటల వరకు వీడలేదు. ప్రస్తుతం కురుస్తున్న మంచు మామిడి, జీడిమామిడి పూతకు నష్టం కలిగిస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

# స్వయంసమృద్ధికి కృషి

**గిరి మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం కృషి చేస్తోంది. స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులను ఆదాయ మార్గాలు మార్చుకునేందుకు ప్రణాళిక రూపొందించింది. వీటి ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇస్తూ వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తోంది.**

- విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ
- గిరి మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం
- పందిరిమామిడి కేవీకే ప్రణాళికవరంగా చర్యలు



చేపలను ఉడికించి శుభ్రం చేస్తున్న మహిళలు



తయారు చేసిన పచ్చడిని బాటిళ్లలో నింపుతున్న మహిళలు

రంపచోడవరం: పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి హైదరాబాద్ (ఎన్ఎఫ్‌డీబీ) సహకారంతో గిరిజన మహిళలకు చేపలు, రొయ్యలతో అప్పడాలు, వడియాలు, కట్‌లెట్లు, సమోసాలు, పచ్చడి, రొయ్యల పచ్చడి తయారీపై శిక్షణ ఇస్తున్నారు. ఈ నెల 19న ప్రారంభమైన శిక్షణ సోమవారంతో ముగుస్తుంది. మొదటి బ్యాచ్‌లో 30 మంది మహిళలకు శిక్షణ ఇవ్వగా, రెండో బ్యాచ్‌లో 40 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నారు.

**స్థానిక వనరులతో..**

ఏజెన్సీలో అధిక సంఖ్యలో ఉన్న జలాశయాలు, చెరువుల ద్వారా చేపలు, రొయ్యలు విరివిగా లభ్యమవుతున్నాయి. వీటిని ఆదాయ వనరుగా మార్చేందుకు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై పందిరిమామిడి కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు గిరి మహిళలకు శిక్షణ ఇస్తున్నారు.

**ఉత్పత్తుల తయారీపై అవగాహన**

విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ విస్తరణ సంచాలకుడు డాక్టర్. ఈ కరుణశ్రీ, ఏపీ ఫిషరీష్ యూనివర్సిటీ, ఫిషరీష్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. చంద్రశేఖర్, కేవీకే ఉండి హోంసైన్సు శాస్త్రవేత్త దేబోరా, సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీష్ టెక్నాలజీ, శాస్త్రవేత్త (విశాఖ) అహ్మద్‌బాషా, కేవీకే మత్స్య శాస్త్రవేత్త ఎ.దేవీవరప్రసాద్‌రెడ్డి మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు.

### శిక్షణతో ఎంతో ప్రయోజనం



కేవీకే ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమం ఎంతో ఉపయోగకరం. ఇంటి వద్దే చేపలు,రొయ్యలతో పచ్చళ్లు, అప్పడాలు, వడియాలు తయారు చేసుకుని మార్కెట్ చేసుకోవచ్చు. పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురైన మా ప్రాంతంలో ఇతర మహిళలతో కలిసి కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేసుకునే ఆలోచన ఉంది.

–దేవీ, సీతారం, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ

### పచ్చళ్ల స్టాల్ ఏర్పాటు చేస్తా



శిక్షణకు వచ్చిన ప్రతి ఒక్కరికి చేపలు, రొయ్యలతో విలువ ఆధారిత ఉత్పత్తులు ఎలా తయారు చేయాలో అవగాహన కల్పించారు. చేపలతో అప్పడాలు, వడియాలు, కట్‌లేట్, సమోసాలు తయారీ తెలుసుకున్నా. మా గ్రామం పర్యాటకులు వచ్చే ఐ.పోలవరం వంతెనకు సమీపంలోని ఉంది. అక్కడే స్టాల్ ఏర్పాటు చేసే ఆలోచన ఉంది.

–కంగల వీరవెంకటలక్ష్మి, ఐ.పోలవరం

### పూర్తి స్థాయి సహకారం



శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తాం. అలాగే జాతీయ మత్స్య మండలి సహకారంతో చేపలు ముళ్లు తీసే మెషీన్, పొలుసు తీసే యంత్రాన్ని అందజేస్తాం. పర్యాటక ప్రాంతంలో స్టాల్స్ ఏర్పాటుకు కృషి చేస్తాం.

–వీరాంజనేయులు, మత్స్య శాస్త్రవేత్త, పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం

## క్లుప్తంగా

### మోదకొండమ్మ ఆలయానికి రూ. 60 వేల విరాళం


చైర్మన్ అప్పలరాజుకు విరాళం అందజేస్తున్న పండా బుజ్జి కుటుంబం

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మకు గ్రామానికి చెందిన భక్తులు పండా బుజ్జి, సుజాత దంపతులు ఆదివారం బంగారు ఆభరణాల నిమిత్తం రూ.60 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తం ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పండా బుజ్జి కుమారులు, కోడళ్లు సురేష్, సుజాత, నాగేంద్ర కుమార్, శ్రీవిద్య, సుదీర్, శ్యామల దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ టీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


వైఎస్సార్ టీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తారువలోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని యూనియన్ నేతలు తెలిపారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు చొక్కాకుల సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బాదిరెడ్డి గంగాధర్, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగలి మంగునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.సంధ్యారాణి, స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు తదితరులున్నారు.

# ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి

- ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు పోలీసుశాఖ చర్యలు
- సందర్శిత ప్రాంతాల్లో ఫోన్ నంబర్లతో కూడిన ఫ్లెక్సీలు
- పర్యాటక ప్రాంతాల్లో సిబ్బంది విధులు


బొర్రా గుహల వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులు

అనంతగిరి: పర్యాటక ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పోలీసుశాఖ దృష్టి సారించింది. జిల్లాలో సందర్శిత ప్రాంతాలను తిలకించేందుకు దేశవిదేశాలతో పాటుగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. కొంతమంది పర్యాటకులు తమ సొంత వాహనాల్లో, మరికొంతమంది పర్యాటకులు ప్రైవేట్ వాహనాల్లో సందర్శనకు వస్తున్నారు.

**ఎక్కడపడితే అక్కడ..**

అరకు ప్రధాన రహదారిని ఆనుకొని చాలాచోట్ల సందర్శిత ప్రాంతాలు ఉన్నాయి. దీంతో పర్యాటకులు, ప్రైవేటు వాహనదారులు తమ వాహనాలను రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ నిలిపివేసి సందర్శిత ప్రాంతాలను తిలకిస్తున్నారు. ప్రధాన రహదారి కావడంతో తరచూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నందున భారీగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. దీనివల్ల పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. గంటల కొద్దీ వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకున్న సందర్భాలు ఉన్నాయి. దీనిపై ఎస్పీ సతీష్‌కుమార్ స్పందించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలకు ఆదేశించారు. దీనిలో భాగంగా అరకు సీఐ దేముడు బాబు అనంతగిరి, అరకువేలి, డుంబ్రిగుడ మండలాల్లోని ప్రధాన రహదారులను ఆనుకొని ఉన్న సందర్శిత ప్రాంతాల్లో సిబ్బందిని ఏర్పాటుచేశారు.

**పోలీసు సిబ్బంది ఏర్పాటు**

ప్రధాన రహదారుల్లో ఎక్కడైనా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడితే పోలీసుశాఖకు సమాచారం అందించేలా ఆయా సందర్శిత ప్రాంతాల్లో ఫోన్ నంబర్లతో ఫ్లెక్సీ బోర్డులను పోలీస్‌శాఖ ఏర్పాటు చేసింది. అనంతగిరి మండలంలో డముకు వ్యూపాయింట్, బొర్రా గుహలు, కాఫీ ప్లాంటేషన్, అరకువేలి మండలంలోని గాలికొండ వ్యూ పాయింట్, ట్రైబల్ మ్యూజియం, పద్మాపురం గార్డెన్, అరకువేలి ప్రధాన రహదారి, డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు.

### ట్రాఫిక్ నియంత్రణకు కృషి



ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. మన్యంలోని అందాలకు తిలకించేందుకు వచ్చే పర్యాటకులు నిరాశతో వెళ్లకూడదనే ఉద్దేశంతో ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు తగు చర్యలు చేపట్టాం. దీనిలో భాగంగా సందర్శిత ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశాం. ట్రాఫిక్ అంతరాయం కలిగితే సమాచారం అందించేలా ఫోన్ నంబర్లతో ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేశాం. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టం వేశాం.

–దేముడుబాబు, సీఐ, అరకు

# ఆధ్యాత్మికతతో ప్రశాంత జీవనం

**అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ**


సుండ్రుపుట్టులో లక్ష్మీనరసింహస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకోవాలని, ఆధ్యాత్మికతతో ప్రశాంత జీవనం సాగించవచ్చని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని శోభకోట పంచాయతీ సుండ్రుపుట్టు గ్రామంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆదివారం పర్యటించారు. గ్రామంలోని లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దైవ చింతనతో మానసిక ప్రశాంతత పొందవచ్చన్నారు. దేవదాయ శాఖ అధికారులతో చర్చించి, గ్రామల్లో దేవాలయల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ఎంపీపీ కూడా రాజుబాబు, నాయకుడు కె.కోటిబాబు, గ్రామ పెద్దలు బాలన్న, కృష్ణారావు, మనోజ్‌కుమార్, ఈశ్వరరావు, సింహాచలం, కామేశ్వరరావు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

**క్రీస్తు బోధనలు అనుసరణీయం**

గూడ గ్రామంలోని చర్చిలో ఆదివారం ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకమని, అనుసరణీయమన్నారు. నాయకులు శామ్యేల్, గ్రామపెద్దలు దాస్, చిట్టిబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

# బాధితులకు అండగా 'మన్య ప్రగతి'


బాధిత వృద్ధురాలికి నగదు, నిత్యావసరాలు అందజేస్తున్న ట్రస్టు చైర్మన్ చెట్టి వికాస్

అరకులోయ రూరల్: మండలంలోని పెదలబుడు పంచాయతీలో మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ చెట్టి వికాస్, తదితరులు ఆదివారం సందర్శించారు. గ్రామంలో గతేడాది జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన వంతల గంగమ్మను కలిసి పరామర్శించారు. గతేడాది జరిగిన ఘటనలో గంగమ్మ ఇంట్లో వస్తుండగా గ్యాస్ లీక్ అయి మంటలు వ్యాపించి ఇల్లు దగ్ధమై, తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రమాద బాధితురాలు గంగమ్మకు రూ.10వేల నగదు, రెండు నెలలకు సరిపడే బియ్యం, నిత్యావసర సరకులను అందజేశారు. చెట్టి వికాస్ మాట్లాడుతూ నిరుపేద, ఒంటరి అయిన గంగమ్మను అన్ని విధాలుగా సంస్థ తరఫున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆమె మనోధైర్యం కల్పించారు. ఎవరు లేకపోవడంతో ఆమె ఎటువంటి పనులు కూడా చేయలేని పరిస్థితులో ఉన్నారని, స్థానిక ప్రజాప్రతినిధుల సమాచారంతో తమ వంతు సహాయం అందించామన్నారు. ఆమె ఇంటి నిర్మాణానికి సామగ్రిని అందజేస్తామన్నారు. మానవత్వంతో ఎవరైనా ఆమెకు సహాయం చేయాలని కోరారు. ఏజెన్సీలో మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్టు సేవలు అభాగ్యుల పాలిట వరంగా నిలుస్తున్నాయన్నారు. అనంతరం గ్రామానికి చెందిన 50 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు భీమరాజు, సర్పంచ్ దాసుబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాములు, సింహాచలం, రంజిత్‌కుమార్.కిరణ్, నగేష్, సంజీవ్, ఆనంద్, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వచ్చేనెల 2 నుంచి శంకులమ్మ తల్లి ఉత్సవాలు


శంకులమ్మతల్లి ఉత్సవాలకు పందిరిరాట ప్రతిష్టలో ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, గ్రామ పెద్దలు

సాక్షి, పాడేరు: గిరిజనుల గ్రామదేవత శంకులమ్మ తల్లి ఉత్సవాలను గుడివాడ గ్రామంలో ఫిబ్రవరి 2,3 తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు గ్రామపెద్దలు నిర్ణయించారు. ఉత్సవాలకు సంబంధించి పందిరిరాట కార్యక్రమాన్ని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఇతర పెద్దలంతా ప్రత్యేక పూజలతో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గుడివాడ చావిడిలోని శంకులమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ శంకులమ్మతల్లి ఉత్సవాలను ప్రజల సహకారంతో విజయవంతంగా నిర్వహించాలన్నారు. గిరిజన ఆచార, సంప్రదాయాన్ని ప్రతిబింభించే విధంగా అమ్మవారి వేడుకలను జరుపుకోవడం శుభపరిణామమని చెప్పారు.మోదకొండమ్మతల్లి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, వైస్ ఎంపీపీ గంగపూజారి శివకుమార్, గ్రామపెద్దలు గూడెపు చినబాబు, అమ్మాజి దంపతులు, బిమలపూజారి సింహాచలం, కొట్టగుళ్లి రామారావు, వెయ్యాకుల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బోనంగి రమణ, అల్లాడ నగేష్, పద్మ, ఆలయ అర్చకులు ఫణిశర్మ తదితరులు పాల్గొన్నారు.

### దుస్తులకు సిగరెట్ అంటుకుని వృద్ధుడికి గాయాలు


కాలిపోయిన నాగేశ్వరరావును రక్షిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నర్సీపట్నం: మున్సిపాలిటీ శారదానగర్‌లోని ఎంవీఆర్ ప్లాజాలో జరిగిన అగ్నిప్రమాదంలో వి. నాగేశ్వరరావు(60) తీవ్రంగా గాయపడ్డాడు. ప్లాజాలోని మూడో అంతస్తులో నివసిస్తున్న అతడు శనివారం రాత్రి సిగరెట్ తాగుతూ నిద్రపోయాడు. ఈ క్రమంలో సిగరెట్ బట్టలకు అంటుకుని మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు శరీరం, కాళ్లుతోపాటు ఇంట్లో సామగ్రి కాలిపోయాయి. రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారి స్వామి తెలిపారు.

### నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ ఎన్నిక ఏకగ్రీవం

తుమ్మపాల: రాష్ట్ర ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వర్, ఉపాధ్యక్షుడు ఈగల శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలో ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన ఎన్నికలో గౌరవ అధ్యక్షుడిగా మల్ల సూర్యనారాయణ, ప్రెసిడెంట్‌గా టి.వెంకటరమణ, కార్యదర్శిగా మైలపిల్లి శివ, సహాయ అధ్యక్షుడిగా కె.ఎర్రజీరావు, కోశాధికారిగా బి.సాయి, వైస్ ప్రెసిడెంట్లుగా కె.నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలుగా సీహెచ్.జ్యోతి, సి.నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డి.సతీష్ ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి టి.విజయానంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వియ్యపు నాగయ్య, సహాయ ఎన్నికల అధికారి సుక్కు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# వెయిటేజ్ కోసం నకిలీ సర్టిఫికెట్లు?

- కోవిడ్ నకిలీ సర్వీస్ సర్టిఫికెట్ల సమర్పణ
- స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీలో వెలుగుచూస్తున్న అక్రమాలు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): స్టాఫ్ నర్సు పోస్టుల కోసం కొంత మంది అభ్యర్థులు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి.. ఉద్యోగం పొందినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పలు పోస్టుల భర్తీలో పలువురు నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి.. ఉద్యోగాలు పొంది తర్వాత కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారం ఇంకా తేలకముందే.. స్టాఫ్ నర్సు పోస్టుల్లో కూడా నకిలీల బెడద ఉన్నట్లు తెలిసింది. వెయిటేజ్ మార్కుల కోసం కొంత మంది నకిలీ కోవిడ్ సర్టిఫికెట్లు సమర్పించినట్లు సమాచారం. ఈ సర్టిఫికెట్లు సమర్పించిన అభ్యర్థుల నుంచి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని నిరుద్యోగ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. కోవిడ్ కాలంలో పనిచేసిన నర్సులకు ప్రభుత్వం 15 వెయిటేజ్ మార్కులు కలిపే అవకాశం కల్పించింది. దీంతో అభ్యర్థులు దరఖాస్తుతో పాటు కోవిడ్ సమయంలో వివిధ ఆస్పత్రుల్లో ఏడాది కాలం పాటు పని చేసినట్లు సర్టిఫికెట్లు సమర్పించారు. దీని వల్ల అనర్హులు ఎంపిక అయ్యారన్న వాదన బలంగా వినిపిస్తోంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి ఎక్కువగా నకిలీ సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిసింది. స్టాఫ్ నర్సుల భర్తీ ప్రక్రియలో భాగంగా 100 మార్కులకు ఎంపిక విధానం ఉండగా.. అందులో 75 మార్కులు విద్యార్హతలు, నర్సింగ్ విద్యకు కేటాయించారు. ఉత్తీర్ణత పొందిన ఏడాదికి ఒక మార్కు చొప్పున అభ్యర్థికి 10 మార్కుల వరకు ఇవ్వవచ్చు. కోవిడ్ సమయంలో ఆరు నెలల కాలం పనిచేస్తే 5 మార్కులు, ఏడాది కాలం పనిచేస్తే 10 మార్కులు, 18 నెలల కాలం పనిచేస్తే 15 మార్కులు వేయిటేజ్ ఇచ్చారు. దీనిని కొంత మంది అభ్యర్థులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. తక్కువ కాలం పనిచేసినా ఏడాది, 18 నెలల కాలం పాటు పనిచేసినట్టు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి.. దరఖాస్తుకు జత చేసినట్లు తెలిసింది. సర్వీస్ కాలం దిద్దడం లేదా వెనుక తేదీతో పనిచేసినట్లు సర్టిఫికెట్లు సృష్టించడం వంటి చర్యలకు దిగినట్లు సమాచారం. దీనిని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆసరాగా తీసుకుని ఎంపిక జాబితాలో అనర్హులకు చోటు కల్పించారు. అవసరం అయిన వారికి వెయిటేజ్ మార్కులు కలపకపోవడం, ఎలాంటి అర్హతలు లేని వారికి మార్కులు కలిపి అందలం ఎక్కించినట్లు సమాచారం. ఉద్యోగులు, ఎంపికైన కొంత మంది అభ్యర్థుల చర్యల వల్ల తమకు అర్హత ఉన్నా.. ఉద్యోగాలు రాలేదని పలువురు నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా.. 179 పోస్టులకు గానూ 172 మందితో అధికారులు జాబితా విడుదల చేసిన సంగతి తెలిసిందే. అందులో 136 మంది కౌన్సెలింగ్‌కు హాజరు కాగా.. 8 మంది ఉద్యోగంలో చేరేందుకు అయిష్టత చూపారు. 36 పోస్టులు వివిధ కారణాల వల్ల భర్తీ కాలేదు.

### ఆ వివరాలు డీఎంహెచ్‌వోలకే తెలుస్తాయి

నకిలీ సర్టిఫికెట్ల అంశం నా దృష్టికి రాలేదు. ఒక వేళ నకిలీ సర్టిఫికెట్లు వచ్చి ఉంటే.. వాటి గురించి మాకు తెలియదు. కోవిడ్ సమయంలో ఎంత కాలం పనిచేశారో అన్న వివరాలు డీఎంహెచ్‌వోలకే తెలుస్తాయి. పనిచేసిన కాలానికి డీఎంహెచ్‌వోల ద్వారా వారికి జీతాలు చెల్లించారు. ఎంపికైన స్టాఫ్ నర్సుల వివరాలు డీఎంహెచ్‌వోలకు పంపిస్తాం. అన్ని అంశాలు పరిశీలన చేసి తర్వాతే వారిని విధుల్లోకి చేర్చుకోవాలి.

– డాక్టర్ ఉమా సుందరి, ప్రాంతీయ డైరెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ

### అంతర్ జిల్లా స్థాయి పోటీలో కాంస్య పతకం


కాంస్య పతక విజేత జాషువా డేనియల్

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన వై. జాషువా డేనియల్ వంద మీటర్ల హర్డల్స్ పోటీలో అంతర్ జిల్లాల స్థాయిలో కాంస్య పతకాన్ని సాధించాడు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2022–23 సంవత్సరానికి సంబంధించి ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన ఈ పోటీలో ప్రతిభ కనబరిచాడని హెచ్‌ఎం ఎ. శ్రీధర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. డేనియల్‌ను పీడీ వి. ప్రభాకరరావు, పేరంట్స్ కమిటీ చైర్‌పర్సన్ బి. దీప, ఉపాధ్యాయులు బి.ఆనంద్, ఆచంట రవి, అప్పారావు, ఎ. నాగేశ్వరరావు, రామారావు, సుధారాణి అభినందించారు.


### 25న జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం మోడల్ కెరీర్ సెంటర్‌లో ఈ నెల 25వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి(క్లరికల్) సిహెచ్ సుబ్బిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సినర్జీస్ కాస్టింగ్, వరుణ్ మోటార్స్, లక్ష్మీ కియా మోటార్స్, లక్ష్మీ హ్యుందాయ్ మోటార్స్, మ్యాంగో మోటార్స్, హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ కంపెనీల్లో 221 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. ట్రైనీ, పెయింటర్స్, టెక్నీషియన్, సేల్స్, కన్సల్టెంట్, టెలీ కాలర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, క్యాషియర్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీల్లో ఉత్తీర్ణత సాధించి 18–35 ఏళ్ల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. ఆయా ఉద్యోగాల బట్టి నెలకు జీతం రూ.13,500 నుంచి రూ.25,000 వరకు ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు https://www.ncs.gov.in/ లో నమోదు చేసుకుని.. బుధవారం ఉదయం 10 గంటలకు జరిగే జాబ్ మేళాకు హాజరు కావాలని ఆయన సూచించారు.

### డ్రైవింగ్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం: ఉపాధి–శిక్షణ శాఖ ఆధ్వర్యంలో హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో 45 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ జి.శ్రీకాంత్ తెలిపారు. కంచరపాలెం పాత పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో ప్రారంభమయ్యే బ్యాచ్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. 21 ఏళ్లు నిండి, లైట్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్, హెవీ వెహికల్ ఎల్‌ఎల్‌ఆర్ ఉన్న అభ్యర్థులు శిక్షణకు అర్హులన్నారు. ఫిబ్రవరి ఒకటి నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని.. మరిన్ని వివరాలకు 91779 67397లో సంప్రదించాలని సూచించారు.

### సికింద్రాబాద్-అగర్తలా మధ్య స్పెషల్



తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్-అగర్తలా మధ్య వీక్లీ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. సికింద్రాబాద్-అగర్తలా(07030) వీక్లీ స్పెషల్ ప్రతి సోమవారం సాయంత్రం 4.35గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 4.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 4.40 గంటలకు బయల్దేరి ప్రతి గురువారం తెల్లవారు 3 గంటలకు అగర్తలా చేరుకుంటుంది. ఈ స్పెషల్ ఫిబ్రవరి 6వ తేదీ నుంచి 27వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో అగర్తలాలో (07029) వీక్లీ స్పెషల్ ప్రతి శుక్రవారం ఉదయం 6.10గంటలకు బయల్దేరి ఆదివారం తెల్లవారు 3.05గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడ నుంచి 3.25 గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 4.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ ఫిబ్రవరి 10వ తేదీ నుంచి మార్చి 3వ తేదీ వరకు నడుస్తుంది.

# ఐటీకి ఊపు

ఐటీ రంగం అభివృద్ధి పథంలో నడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ఐటీ, ఐటీ ఆధారిత రంగాల్లో దిగ్గజసంస్థలు విశాఖలో కార్యకలాపాలు ప్రారంభిస్తుండగా.. మరిన్ని కంపెనీలకు ఎర్ర తివాచీ పరిచేందుకు ప్రభుత్వం కార్యచరణ రూపొందించింది. రెండు రోజుల క్రితం నిర్వహించిన ఇన్ఫినిటీ వైజాగ్ సమ్మిట్–2023 సదస్సులో ఐటీ రంగం అభివృద్ధికి విశాఖలో ఉన్న అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ చేయడంతో.. మరిన్ని సంస్థలు ఇటుగా అడుగులు వేసేందుకు ఎదురు చూస్తున్నాయి.


మిలీనియం టవర్స్

- విశాఖ సమీపంలో ఐటీపార్క్
- భోగాపురం వద్ద 90.10 ఎకరాల్లో అభివృద్ధి
- అందుబాటులో 1.90 లక్షల చ.అడుగుల విస్తీర్ణం
- త్వరలో మరికొన్ని ఐటీ సంస్థల కార్యకలాపాలు


ఐటీ పార్క్ రానున్న కంచేరుపాలెం ప్రాంతం

సాక్షి, విశాఖపట్నం: విశాఖ నగరాన్ని ఐటీ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి క్రమంగా ఫలిస్తోంది. ఐటీ, దాని ఆధారిత పరిశ్రమలైన ఇన్ఫోసిస్, డబ్ల్యూఎన్‌ఎస్, రాన్‌స్టాండ్ సంస్థలు తమ కార్యకలాపాలు ప్రారంభించగా.. అమెజాన్, విప్రో, ఐబీఎం సంస్థలు త్వరలోనే వైజాగ్‌లో అడుగుపెట్టనున్నాయి. మరిన్ని సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానం పలికిన వేళ... ఆయా సంస్థలకు అవసరమైన మౌలిక వసతులు, వనరులు సిద్ధం చేసేందుకు కొత్త ఐటీ పార్క్ అభివృద్ధికి ప్రణాళికలు తయారయ్యాయి. ఇప్పటికే మధురవాడలోని ఐటీహిల్స్‌లో పదుల సంఖ్యలో పరిశ్రమలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. దీనికి అనుబంధంగా మరో ఐటీ హబ్ విశాఖకు సమీపంలో సిద్ధంకానుంది.

**భోగాపురం వద్ద 90.10 ఎకరాల్లో...**

ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమల స్థాపన కోసం ప్రత్యేక హబ్‌ని తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకోసం విశాఖ నగరానికి సమీపంలో ఉన్న భూమిని గుర్తించింది. భోగాపురం సమీపంలోని కంచేరుపాలెంలోని సర్వే నం.1లో 90.10 ఎకరాల విస్తీర్ణంలో ఐటీ పార్క్ ఏర్పాటు కానుంది. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌కు 53 కి.మీ, విజయనగరం రైల్వే స్టేషన్‌కు 32 కి.మీ దూరంలోనూ, ఎన్‌హెచ్–16కు 9 కి.మీ దూరంలో ఈ పార్క్ రాబోతోంది. ప్రతిపాదిత భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి కూతవేటు దూరంలో వస్తున్న ఐటీ పార్క్‌కు కావల్సిన పూర్తి వనరులు, వసతులు అందుబాటులోనే ఉన్నాయి. ఈ స్థల అభివృద్ధికి కార్యచరణ రూపుదిద్దుకుంటోంది.

**ఐటీ హిల్స్‌లోనూ అందుబాటులో స్థలం**

ఓవైపు ప్రత్యేక ఐటీ పార్క్ అభివృద్ధికి శ్రీకారం చుడుతుండగా.. ప్రస్తుతం ఉన్న మధురవాడ ఐటీ హిల్స్‌లోనూ వెంటనే సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించేందుకు అవసరమైన స్థలం కూడా అందుబాటులో ఉంది. 1.90 లక్షల చ.అడుగుల విస్తీర్ణంలో ఆఫీస్ స్పేస్ కూడా సిద్ధం చేస్తున్నట్లు అధికారులు సంస్థలకు తెలిపారు. ఇందుకోసం మరో 1.20 లక్షల పార్కింగ్ స్థలం కూడా అందుబాటులో ఉంది. ఇక్కడ ఉన్న అవకాశాల్ని వినియోగించుకోవాలంటూ ప్రధాన ఐటీ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం లేఖలు రాసింది. విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించాలని ఆహ్వానాలు అందించింది.

### విశాఖలో ఐటీకి అవకాశాలు



ఉద్యోగులు ఉన్న చోటికే సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించే సంస్కృతి ఐటీ రంగంలో మొదలైంది. ఐటీ ఉద్యోగులు అత్యధికంగా ఉత్తరాంధ్ర పరిసర ప్రాంతాల్లోనే ఉన్నారు. అంటే.. విశాఖలోనే ఐటీ కంపెనీలు కార్యకలాపాలు ప్రారంభించే ఆస్కారం ఉంది. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఐటీ పార్క్‌ని కూడా భోగాపురం వద్ద సిద్ధం చేయడం శుభపరిణామం. ఇవన్నీ పూర్తయితే కొత్త కంపెనీలు వచ్చేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఒక్కో పరిశ్రమ అడుగులు వేస్తే.. విశాఖలోనే ఐటీ రంగం భవిష్యత్తు ఉంటుందనేది వాస్తవం.

– శ్రీధర్ కొసరాజు, ఐటాప్ రాష్ట్ర అధ్యక్షుడు


## సాక్షి క్లాసిఫైడ్స్

**Services**

**ఆయుర్వేదం**
- బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్ర: 9603055647, 7995392747 [G-888]

**BUSINESS OFFER**
- We Super Stockist of FMCG Products of Masalas & Deserts is looking for District wise Distributors in TS & AP. www.mleps.in Cont: 70329 43367 [Y-748948]

**GOLD LOANS**
- లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 4001]

**Wanted**
- రామ టాకీస్ ఏరియా ఆఫీసులో వర్క్ చేయుటకు రిసెప్షనిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్స్, టెలీ కాలర్స్, లేడీ మేనేజర్, ప్యాకింగ్ గర్ల్స్ కావలెను. డైరెక్ట్ జాబ్స్, జీతం : 12 K to 25 K. ఫోన్ : 81253 60910 [V-776966]
- మధురవాడ, ఎండాడ, కొమ్మాది ఏరియాలో Professional courier లో Full time Delivery చేయుటకు డెలివరీ బాయ్స్ కావలెను. అర్హత : 10th and any, జీతం : 10 K నుండి 15K వరకు, ఆఫీసులో పనిచేయుటకు గర్ల్స్ కావలెను. ఫోన్ : 89858 95896, 94947 19994 [V- 776851]
- మీ జాబ్ మీకు ఆదాయం తెస్తుంది. Rs.1500/ Day Benefits : P/F, జాబ్, సౌకర్యవంతమైన పని వేళలు, డైలీ / వీక్లీ ఇన్సెంటివ్స్, ఇన్సూరెన్సు 5 లక్షలు వరకు. ఫోన్ : 040-49171799, 73962 67109 [V- 10030]
- ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రసులు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776043]
- AR Tech సంస్థ నందు (15000/- to 20,000/-) పనిచేయుటకు, వయస్సు : 18 to 28 లోపు (Un Married) యువతీ / యువకులు, 10th to PG. ఉచిత వసతి. ఫోన్ : 77996 54777, 63051 36884 [V- 2531]
- Wanted Tele Callers (Female) for Digital Media Promotion Company. Qlf : Any Degree / B.Tech. Age : 23 to 30 yrs. Exp : Min One Year. Sal : 15 k to 24 k + Incentives. Sheelanagar, VSP. Ph : 99859 27377 [V- 775086]
- రెడీమేడ్ షాపులో సెక్యూరిటీ గార్డ్స్ (M/F) కావలెను. జీతం : 12,000/- నుండి 14,000/-. పవన్ ఫ్యామిలీ ఆఫ్‌మాల్, ద్వారకనగర్, విశాఖ. (డైరెక్ట్ రిక్రూట్‌మెంట్). ఫోన్ : 94408 02456, 94408 02452 [V- 689]
- విశాఖపట్నంలో SBS నందు పనిచేయుటకు టూ వీలర్ కలిగిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కావలెను. 9949445899, 9398820227 [G-1038]
- హైదరాబాద్‌లో 5 స్టార్ హోటల్‌లో క్యాటరింగ్ బాయ్స్ & హౌస్‌కీపింగ్ బాయ్స్ కావలెను జీ: 13వే - 27 వేలు, రూం + మీల్స్ ఫ్రీ Age: 18-28 డైరెక్ట్ జాబ్, ఎటువంటి విద్యార్హతలు లేదు మగవారికి మాత్రమే. Ph:8333003754/ 8639879970 [H-792778]
- హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ. 18k. ఏజెంట్ కమీషన్ 3k. ఫోన్ : 9640259988, 9640198899. [H-786821]
- ప్రముఖ కంపెనీకి మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్‌టైం 1గం॥ పోస్టల్ కవర్స్‌పై అడ్రసులు వ్రాయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. కాల్/వాట్సప్. 9704987227 [G-779858]

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**సాక్షి క్లాసిఫైడ్స్** లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

| | |
|---|---|
| అనకాపల్లి | :9010546644 |
| యలమంచిలి | :9951602901 |
| చోడవరం | :9010210265 |
| నర్సీపట్నం | :9010234557 |
| పాడేరు | :9010973030 |

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం